క్లుప్తంగా

స్టడీ మెటీరియల్ అందజేత


మెటీరియల్ అందిస్తున్న భోజారెడ్డి

లోకేశ్వరం: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు భైంసా మండలం బిజ్జూరు గ్రామానికి చెందిన భోజారెడ్డి రూ.12వేల విలువైన స్టడీమెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు. దాత భోజారెడ్డి మాట్లాడుతూ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకొని మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమేశ్ తదితరులు ఉన్నారు.

‘పాఠశాలల రికార్డులు స్వాధీనం చేసుకోవాలి’

ఖానాపూర్: జిల్లావ్యాప్తంగా ఏళ్ల కిందట మూతబడిన పాఠశాలల అడ్మిషన్ రికార్డులను విద్యాశాఖ అధికారులు వెంటనే స్వాధీనం చేసుకోవాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పొన్నం శివాజీగౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. పలు పాఠశాలల యాజమాన్యాలు అడ్మిషన్ రిజిస్టర్లు దగ్గర పెట్టుకుని బొనఫైడ్ సర్టిఫికెట్లు అమ్ముకోవడంతో పాటు రిజిస్టర్లలో ఉన్న పేర్లను తారుమారు చేస్తున్నారని ఆరోపించారు. అవసర నిమిత్తం బొనఫైడ్ కోసం వెళ్లే వారి వద్ద డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అధికారులు స్పందించాలని.. లేకుంటే విద్యార్థులతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

అంబేద్కర్‌కు అవమానం


పాఠశాలలో వివరాలు తెలుసుకుంటున్న సీఐ రాంనరసింహారెడ్డి, సిబ్బంది

లక్ష్మణచాంద: మండలంలోని మల్లాపూర్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంబేద్కర్ చిత్రపటానికి అవమానం జరిగింది. పాఠశాల గోడపై ఉన్న అంబేద్కర్ చిత్రపటానికి గుర్తుతెలియని వ్యక్తులు రంగు పూశారు. బుధవారం ఉదయం పలువురు గమనించి సర్పంచ్ రవి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సర్పంచ్, అంబేద్కర్ సంఘం నాయకులతో కలిసి పాఠశాలకు వెళ్లారు. ప్రధానోపాధ్యాయుడు మాజీద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సోన్ సీఐ రాంనరసింహారెడ్డి పాఠశాలకు వచ్చి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాహుల్ తెలిపారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పలువురు పోలీసులను కోరారు. లక్ష్మణచాంద, సోన్ ఎస్సైలు రాహుల్ గైక్వాడ్, రవీందర్, అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పనులు ప్రారంభం

భైంసారూరల్: మన ఊరు–మన బడిలో భాగంగా బుధవారం మండలంలోని కుంసర ప్రాథమిక పాఠశాలలో పనులను సర్పంచ్ ప్రవీణ్ ప్రారంభించారు. పాఠశాలలో వసతుల కోసం ప్రభుత్వం రూ.42 లక్షలు మంజూరు చేసిందన్నారు. ప్రధానోపాధ్యాయురాలు జయశ్రీ, సోలంకి భీంరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలు

ఖానాపూర్: పరీక్షా పే చర్చలో భాగంగా బుధవారం పట్టణంలోని శాంతినగర్ మహాత్మ జ్యోతి బాపూలే బాలుర హైస్కూల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. పాఠశాలలోని 8, 9,10 తరగతులకు చెందిన 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పడాల రాజశేఖర్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు సందుపట్ల శ్రావణ్, రవి, ఇనుముల స్వామి, సుధాకర్, సాయికృష్ణ, సాయికిరణ్, తదితరులు ఉన్నారు.

నూతన కార్యవర్గం

నర్సాపూర్(జి): మండలంలోని తురాటి గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఎ.శంకర్, సహాయ కార్యదర్శిగా యం.భోజన్న, కోశాధికారిగా పి.ప్రవీణ్ కుమార్, సహాయ కోశాధికారిగా ఎ.లక్ష్మణ్, ప్రచార కార్యదర్శిగా ఎ.రాములు, సురేందర్, సలహాదారులుగా ఎ.చిన్నన్న, జి.గంగాకిషన్, కిరణ్, శ్రీకాంత్‌ను ఎన్నుకున్నారు.

చికెన్ కిలో రూ.100.. ఎగబడిన జనం


చికెన్ సెంటర్ వద్ద ప్రజల రద్దీ

కుభీర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద బుధవారం రెండు చికెన్ సెంటర్ల నిర్వాహకులు పోటీపడి కిలో చికెన్ రూ.100కు విక్రయించారు. చికెన్ కోసం జనం ఎగబడటంతో రోడ్డు వద్ద రద్దీ నెలకొంది.

పచ్చబంగారానికి ధర దక్కేనా?

- ప్రారంభమైన పసుపు తవ్వకాలు
- తగ్గిన దిగుబడులు
- నిరాశాజనకంగా మార్కెట్ ధరలు
- మద్దతు ధర అందేలా చూడాలని జిల్లా రైతుల వేడుకోలు


తవ్విన అనంతరం నిల్వ ఉన్న పసుపు కొమ్ములు


సిద్దులకుంటలో పసుపు తవ్వకాలు

మామడ: జిల్లాలో పసుపు పంట తవ్వకాలు ప్రారంభమయ్యాయి. ఆరుగాలం కష్టించి పంట సాగు చేసిన పసుపు రైతులు ఈసారి దిగుబడులపై గంపెడశలు పెట్టుకున్నారు. తొమ్మిది నెలల వాణిజ్య పంట అయిన పసుపులో పెట్టుబడులు పెరగడంతోపాటు అధిక వర్షాల కారణంగా దుంపకుళ్లు సోకడం దిగుబడులపై ప్రభావం చూపింది. ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్ల వరకు రావాల్సిన పంట దుంపకుళ్లు తెగులు కారణంగా 10 నుంచి 15 క్వింటాళ్ల వరకు మాత్రమే వచ్చేలా ఉందని రైతులు వాపోతున్నారు. జిల్లాలో ఈసారి 11,792 ఎకరాల్లో పసుపు పంట సాగు చేసినట్లు జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రాథోడ్ శ్యాంరావ్ తెలిపారు.

పెరిగిన పెట్టుబడులు..

గతేడాదితో పోలిస్తే ఈసారి పెట్టుబడులు గణనీయంగా పెరిగాయి. ఎకరం పసుపు పంట సాగుకు నల్లమట్టి, పశువుల పేడకు రూ.60 వేలు, రసాయన ఎరువులకు రూ.20 వేలు, తవ్వేందుకు రూ.16వేలు, పసుపు ఉడికించేందుకు రూ.16వేల వరకు ఖర్చవుతోంది. మొత్తంగా ఎకరం సాగుకు అయ్యే వ్యయం దాదాపు రూ.1.12లక్షలు. వాతావరణం అనుకూలిస్తే పసుపు పంటలో ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయి. ఈసారి తెగుళ్లు, అధిక వర్షాల కారణంగా 10 క్వింటాళ్లకు మించి దిగుబడులు వచ్చేలా లేదని రైతులు పేర్కొంటున్నారు.

నిరాశ కలిగిస్తున్న మార్కెట్ ధరలు..

2012లో పసుపు పంటకు క్వింటాల్‌కు రూ.15 వేల వరకు ధర పలకడంతో రైతులు సంబరపడ్డారు. ఒక యేడాది మాత్రమే పంటకు మంచి ధర ఉండి.. తర్వాత పడిపోయాయి.

మంచి ధరలు ఉంటాయన్న ఆశతో ఏటా పసుపు సాగు చేస్తున్న రైతులకు నిరాశే మిగులుతోంది. ప్రస్తుతం నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో పసుపు క్వింటాల్ ధర రూ.5,700 నుంచి రూ.ఆరు వేల వరకు పలుకుతుంది. కనీసం క్వింటాల్‌కు రూ.15వేలు అందిస్తే తమకు గిట్టుబాటు అవుతుందని.. లేకుండా పెట్టుబడులు కూడా నష్టపోతామని ఆయా గ్రామాల పసుపు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో పసుపు సాగు వివరాలు

మండలం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
భైంసా	33.07
కుభీర్	167.24
కుంటాల	73.21
దస్తురాబాద్	28.12
కడెం	344.20
ఖానాపూర్	828.19
పెంబి	556.33
లోకేశ్వరం	95.26
ముధోల్	29.01
తానూరు	66.14
దిలావర్‌పూర్	704.15
నర్సాపూర్(జి)	79.31
సారంగపూర్	428.13
సోన్	1439.14
లక్ష్మణచాంద	1604.21
మామడ	3507.33
నిర్మల్‌రూరల్	1799.27
నిర్మల్	10.20
మొత్తం	11,792.51

మద్దతు ధర అందించాలి



మూడెకరాల్లో పసుపు పంట సాగు చేశా. చేతికొచ్చిన పంట ను విక్రయిద్దామంటే మార్కెట్ ధరలు నిరాశ కలిగిస్తున్నాయి. ప్రస్తుతం నిజామాబాద్ మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.5వేల ధర ఉంది. మాకు పెట్టుబడి ఎకరాకు లక్షకు పైగా అవుతోంది. ఇప్పటికైనా మద్దతు ధర అందించి రైతులను ఆదుకోవాలి.

– మధుసూదన్‌రెడ్డి, సిద్దులకుంట

దిగుబడులు తగ్గాయి



రెండెకరాల్లో పసుపు పంట సాగు చేశాను. మార్కెట్‌లో ధర లేకపోవడంతో రైతులకు నష్టం కలుగుతోంది. అధిక వర్షాల కారణంగా పసుపు పంట దిగుబడులు తగ్గాయి. ఎకరాకు పది క్వింటాళ్ల పంట కూడా వచ్చేలా లేదు. ధరలు కూడా లేకపోవడంతో నష్టాలు తప్పేలా లేవు.

– ఆశన్న, పొన్కల్

సామాన్యుడి ఆయుధం ఓటుహక్కు

- ఊరూరా జాతీయ ఓటరు దినోత్సవం
- ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించిన అధికారులు


నర్సాపూర్(జి)లో మానవహారంగా విద్యార్థులు


భైంసాలో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి ప్రతిజ్ఞ


కుభీర్‌లో మాట్లాడుతున్న తహసీల్దార్ విశ్వంభర్


తానూరు ఉన్నత పాఠశాలలో ఓటరు ప్రతిజ్ఞ


కడెం: ఓటరు కార్డు అందజేస్తున్న నాయకులు

భైంసాటౌన్: జిల్లావ్యాప్తంగా బుధవారం జాతీయ ఓటరు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలు, కార్యాలయాల్లో ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. 18ఏళ్లు నిండిన వారంతా విధిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. భైంసాలో విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ వద్ద రోడ్డుపై మానవహారం ఏర్పాటు చేసి ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఎంఈవో సుభాశ్, సీఐ ప్రవీణ్‌కుమార్, ఆర్ఐ కృష్ణ, జయరావ్ పాల్గొన్నారు.

తానూరు: తానూరులోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన ఓటరు ప్రతిజ్ఞలో ప్రధానోపాధ్యాయులు భూమన్నయాదవ్, సుభాశ్ మోస్లే, తహసీల్దార్ వెంకటరమణ, డిప్యూటీ తహసీల్దార్ లచ్చరాం, సర్పంచ్ విఠల్, మాధవ్‌రావ్, రమేశ్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంలో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, సర్పంచ్ రాంరెడ్డి, ఎంపీఓ శ్రీనివాస్‌గౌడ్, ఆర్ఐ వేణుగోపాల్, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో సహకార జూనియర్ కళాశాలలో ఓటరు దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మహిపాల్, అధ్యాపకులు కిష్టయ్య, రాజేశ్వర్, పీవోలు శ్రీనివాస్, రమేశ్, వలంటీర్లు పాల్గొన్నారు.

కుభీర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటుహక్కుపై తహసీల్దార్ బి.విశ్వంభర్ అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ సునీల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్ ఉన్నారు.

కుంటాల : ఓటుహక్కు వజ్రాయుధమని తహసీల్దార్ ఎంఏ కలీం పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఓటరు ప్రతిజ్ఞ చేయించి మాట్లాడారు. డీటీ నరేశ్‌గౌడ్, ఆర్ఐ విజయ్ ఉన్నారు.

భైంసారూరల్: మండలంలోని గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. సర్పంచులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముధోల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ముధోల్ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సారథిరాజు విద్యార్థులకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు.

ఖానాపూర్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజమోహన్ ఆధ్వర్యంలో సిబ్బంది ఓటరు ప్రతిజ్ఞ చేశారు. సత్తనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం వాల్గొట్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ మల్లేశ్ ఆధ్వర్యంలో సిబ్బంది ఓటరు ప్రతిజ్ఞ చేశారు.

కడెం: కడెంతోపాటు కొండుకూర్, లింగాపూర్ తదితర గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ గజానన్ సీనియర్ సిటిజన్‌ను సన్మానించారు. సర్పంచ్‌లు అనూష, వేణుగోపాల్, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు ఉన్నారు.

సారంగపూర్: మండలంలోని గ్రామాల్లో ఓటుహక్కు ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, ఎంపీడీఓ సరోజ, తహసీల్దార్ సంతోశ్‌రెడ్డి, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: ఓటుహక్కును వినియోగించుకొని నిజాయతీని గెలిపించాలని తహసీల్దార్ సరిత అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాక్‌పోలింగ్ నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ అశోక్, శ్యాంసుందర్, ఎంపీడీవో సల్మాన్‌రాజ్, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, ఎంపీటీసీ జయసాగర్, భోజన్న, ప్రధానోపాధ్యాయుడు రమేశ్ పాల్గొన్నారు.

ప్రమాదం ఎప్పుడైనా జరగొచ్చు





నిత్యం వందలాది మంది వచ్చిపోయే నిర్మల్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలతో ప్రమాదం పొంచి ఉంది. వర్షాకాలంలో కూలిన భవనం పైకప్పును సరిచేయకుండా భవనానికి కట్టె దిమ్మెలు అడ్డుగా పెట్టి నెట్టుకొస్తున్నారు. దీంతో కట్టెలు ఎప్పుడు విరిగి ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నెలలు గడుస్తున్నా.. ఎవరూ స్పందించడం లేదు. అధికారులు మరమ్మతులు చేస్తేనే ముప్పు తొలుగుతుంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

అటెన్షన్ ప్లీజ్.. రోడ్డుకు మరమ్మతులు చేయరూ



కుభీర్: మండల కేంద్రం నుంచి తొటంబాకు వెళ్లే మార్గంలో బెల్గాం శివారులో రోడ్డు ఓ వైపు వరద కోతకు గురైంది. ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు, రాత్రి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి ఇరువైపులా గ్రావెల్ వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: కొండయ్య, ఆర్అండ్‌బీ డీఈ, ఫోన్: 9666331486

కనుల పండువగా వార్షికోత్సవం


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు


ఆలయం వద్ద భక్తుల సందడి

లక్ష్మణచాంద: మండలంలోని చింతల్‌చాందలో వరసిద్ధి వినాయకుడి జాతరను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ 12వ వార్షికోత్సవంలో భాగంగా ఉదయం గోదావరి నది నుండి పవిత్ర జలాలను ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామివారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. సిద్ధి వినాయకుడి కల్యాణం సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు గ్రామం నుంచి భాజాభజంత్రీల నడుమ ఆలయం వద్దకు తీసుకొచ్చారు. మధ్యాహ్నం వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం గ్రామంలోని ప్రధాన వీధులగుండా స్వామివారి రథోత్సవం నిర్వహించారు.

జాతరకు వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజమణి, ఉపసర్పంచ్ అశోక్, ఆలయ కమిటీ సభ్యులు మధుకర్ రెడ్డి, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

రైతులెవరూ ఆందోళన చెందవద్దు

- ఇష్టానుసారంగా కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు
- మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: మున్సిపాలిటీ మాస్టర్‌ప్లాన్ విషయంలో రైతులు అపోహల బారిన పడి ఆందోళన చెందవద్దని.. మంత్రి ఐకేరెడ్డి అండగా ఉన్నారని నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. బుధవారం మాస్టర్‌ప్లాన్‌పై ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని.. వారి మాటలు పట్టించుకోవద్దన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయాలు చేసుకుందామని.. అవగాహన లేకుండా మాట్లాడుతూ ప్రజల్ని రెచ్చగొట్టడం సరికాదని నిర్మల్ మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డికి సూచించారు. మంత్రి ఐకేరెడ్డిపై ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని.. మహేశ్వర్ రెడ్డి ఎన్ని ఎత్తుగడలు వేసిన వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

160అభ్యంతరాలు స్వీకరణ

ఇప్పటివరకు మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్‌పై 160 అభ్యంతరాలు వచ్చాయని చైర్మన్ తెలిపారు. ఫిబ్రవరి10 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. మాస్టర్ ప్లాన్‌లో ఇండస్ట్రీయల్, రెసిడెన్షియల్, మిక్సింగ్ సవరణలు చేస్తామన్నారు. డీసీసీబీ చైర్మన్ రాంకిషన్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బుద్ధుడి విగ్రహావిష్కరణకు తరలిరావాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

సారంగపూర్: లోకేశ్వరం మండలం కనకాపూర్ గ్రామంలో ఈనెల 29న నిర్వహించే బుద్ధుడి విగ్రహావిష్కరణకు తరలిరావాలని అంబేద్కర్ సంఘం నాయకులు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో విగ్రహావిష్కరణకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం మండలాధ్యక్షుడు పిల్లి నాగయ్య మాట్లాడుతూ విగ్రహావిష్కరణకు అంబేద్కర్ మనవడు భీంరావు యశ్వంత్‌రావు అంబేద్కర్ హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లాలోని బౌద్ధ ఉపాసకులు, అంబేద్కర్‌వాదులు, బహుజనులు హాజరవాలని కోరారు. కొంతం మురళి, బొడ్డు నరేశ్, కొండా రమేశ్, శ్రీనివాస్, రాజేశ్వర్, సాయన్న, వినోద్, రాజశేఖర్, సాయన్న పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్‌లో ఈనెల 29న ప్రారంభించే బుద్ధుడి విగ్రహావిష్కరణకు అదే గ్రామానికి చెందిన భైరి భోజన్న రూ.11వేలను కమిటీ సభ్యులకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు రావాలని ఆహ్వానం


ఖానాపూర్‌లో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నేతలు

కడెం: మండలంలోని దిల్దార్‌నగర్, ఎలగడప, సారంగపూర్ గ్రామాల సమీపంలోని అక్కకొండ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 1 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే రేఖానాయక్‌కు, సీఐ అజయ్‌బాబు, ఎస్సై రాజుకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ రాజారమేశ్‌గౌడ్, జగ్గారెడ్డి, గంగన్న తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని సాయిబాబా ఆలయ అభివృద్ధికి రూ.50లక్షలు మంజూరయ్యేలా కృషి చేసిన ఎమ్మెల్యే రేఖానాయక్‌ను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు బుధవారం ఎమ్మెల్యేను తన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రాజేందర్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

డీటీగా నరేశ్‌గౌడ్

కుంటాల : కుంటాల డీటీగా నరేశ్‌గౌడ్ బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. కలెక్టరేట్‌లో పని చేసిన ఈయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన శేఖర్ బదిలీపై నిర్మల్ వెళ్లారు. నూతన డీటీని తహసీల్దార్ కలీం, ఆర్ఐ విజయ్ సన్మానించి అభినందించారు.